సాక్షి
కుమురం భీం

గురువారం : 28 : మార్చి : 2024



నిప్పుతో జాగ్రత్త..!

వేసవిలో చిన్నచిన్న తప్పిదాలతోనే అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. ముందు జాగ్రత్తలు తీసుకుంటే చాలా వరకు ప్రమాదాలు నివారించే అవకాశం ఉంటుంది. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురు : 6:30	శుక్ర: 4:51

గరిష్టం/కనిష్టం
39.7 /28.2

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మున్సిపాలిటీ అభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న షాహీన్ మసూద్

ఆసిఫాబాద్‌అర్బన్: నూతనంగా ఏర్పడిన ఆసిఫాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి పటిష్ట చర్యలు తీసుకుంటామని వరంగల్ రీజినల్ మేనేజర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ షాహీన్ మసూద్ తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని బుధవారం కమిషనర్ భుజంగ్‌రావు, అధికారులతో కలిసి పరిశీలించారు. రికార్డులు పరిశీలించి ఇతర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధి విషయంలో అధికారులు, సిబ్బంది అవకతవకలకు పాల్పడొద్దన్నారు. తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నూతన మున్సిపల్ కార్యాలయాల నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ప్రజలు, అధికారుల సహాయంతో అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈ మసూద్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు గ్రూప్స్, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్ తదితర రాష్ట్ర, కేంద్రస్థాయి ఉద్యోగాల కోసం స్పెషల్ ఫౌండేషన్ కోర్సు ద్వారా మూడు నెలల శిక్షణ అందించనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సజీవన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న కాగజ్‌నగర్‌లోని సాయితేజ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ల ద్వారా ఎంపిక ప్రక్రియ చేపడతామన్నారు. డిగ్రీ మార్కుల ద్వారా సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత వసతి, శిక్షణ ఉంటుందన్నారు. అర్హులైన వారు కుల, ఆదాయం, పదోతరగతి, డిగ్రీ, ఆధార్‌కార్డు జిరాక్సులు, రెండు పాస్ ఫొటోలతో స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99585 74060, 82472 99217 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

‘విద్యుత్ లైన్ల కింద నిప్పు పెట్టొద్దు’

ఆసిఫాబాద్‌అర్బన్: 400 కేవీ విద్యుత్ లైన్ల కింద పంట వ్యర్థాలకు నిప్పు పెట్టొద్దని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఇంజినీర్ గౌతమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల కింద పంటలు సాగు చేసే రైతులు చేనులో మిగిలిన వ్యర్థాలు, చెత్తాచెదారానికి నిప్పు పెడితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆసిఫాబాద్‌లోని అంకుసాపూర్, బలాన్‌పూర్, చెర్పల్లి, గుండి, నందుప, రాపల్లె, సామెల, సంకెపల్లి, దహెగాం మండలంలోని ఇట్యాల, కాగజ్‌నగర్‌లోని అంఖోడ, బోడేపల్లె, దుబ్బగూడ, ఈజ్‌గాం, గన్నారం, జంబుగా, మాండ్వ, మోసం, నాగంపేట్, నజ్రూల్‌నగర్, రాస్పెల్లి, వల్లకొండ, రెబ్బెన మండలంలోని ఫకీర్‌పల్లె, గంగాపూర్, జక్కులపల్లి, కైరిగాం, కిష్టాపూర్, కొమరవెల్లి, మేడిగూడ, నంబాల, నారాయణ్‌పూర్, నవేగాం, రాజారాం, రాంపూర్, రంగాపూర్, రెబ్బెన, రాళ్లపేట్, సిర్పూర్(టి) మండలంలోని అచ్చెల్లి, ఆరెపల్లె, చింతకుంట, చుంచుపల్లె, హీరాపూర్, లక్ష్మీపూర్, రుద్రారం, సిర్పూర్, వెంకట్‌రావ్‌పేట్, వాంకిడి మండలంలోని బంబారా, బోరాంజిగూడ, గోయగాం, కన్నెర్‌గాం, ఖమానా, ఖేడేగాం, కోమటిగూడ, నవేగాం, నీమ్‌గాం, సామెలా, వాంకిడి కలాన్, వాంకిడి ఖుర్దు గ్రామాల పరిధిలో విద్యుత్ తీగల కింద పంటలు సాగు చేసే రైతులు అధికంగా ఉన్నారని తెలిపారు.

అగ్ని ప్రమాదాల నివారణకు టోల్‌ఫ్రీ నంబర్లు

ఆసిఫాబాద్‌అర్బన్: అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణ కోసం అటవీశాఖ అధికారులకు సమాచారం అందించేందుకు టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేసినట్లు డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించేందుకు 18004 255364, 98033 38666 నంబర్లు 24 గంటలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

కొన్నది కొంతే!



జిల్లా కేంద్రంలోని జిన్నింగ్ మిల్లులో పత్తి నిల్వలు(ఫైల్)

- జిల్లాలో ముగిసిన సీసీఐ పత్తి కొనుగోళ్లు
- 21 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా..
- ఇప్పటివరకు 12,66,641 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు
- మార్కెటింగ్ శాఖకు రూ.8.43 కోట్ల ఆదాయం
- మహారాష్ట్రకు తరలిన మన పంట

ఆసిఫాబాద్: జిల్లాలో గతేడాది నవంబర్‌లో ప్రారంభమైన పత్తి కొనుగోళ్లు నాలుగు నెలల పాటు కొనసాగాయి. సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోళ్లు దాదాపు పూర్తయ్యాయి. గతేడాది కేంద్ర ప్రభుత్వం పత్తికి మద్దతు ధర క్వింటాల్ రూ.6025 ప్రకటించగా, ఈ ఏడాది క్వింటాల్‌కు రూ.7020 నిర్ణయించింది. గతేడాది మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్‌లో రేటు ఎక్కువగా ఉండటంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకే పత్తి విక్రయించారు. ఈసారి మాత్రం ప్రైవేటులో ధర ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఎక్కువ మంది సీసీఐకి విక్రయించేందుకే ఆసక్తి చూపారు. అయినా సీసీఐ కొనుగోళ్ల లక్ష్యం చేరుకోలేకపోయింది.

3.03 లక్షల ఎకరాల్లో సాగు..

ఈ ఏడాది జిల్లాలో 3.03 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. 21 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని మార్కెటింగ్ శాఖ అంచనా వేసింది. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఎకరాకు 7 క్వింటాళ్ల పత్తి దిగుబడి అంచనా వేసినా వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం దిగుబడి తగ్గింది. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, జైనూర్ మార్కెట్ కమిటీల పరిధిలో 18 జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ పత్తి కొనుగోళ్లు చేపట్టింది. ఇప్పటివరకు 12,66,641 క్వింటాళ్ల పత్తి కొనుగోళ్లు జరిగాయి. ప్రభుత్వానికి రూ.10.48 కోట్ల ఆదాయం వస్తుందని లక్ష్యంగా నిర్దేశించుకున్నా.. ఇప్పటివరకు రూ.8.43 కోట్ల ఆదాయం సమకూరింది. గతేడాది రూ.9.36 కోట్ల ఆదాయం వచ్చింది. జిల్లాతో పోలిస్తే మహారాష్ట్రలో అధిక ధర లభించడంతో ఇక్కడి వ్యాపారులు, రైతులు తమ పంటను పక్క రాష్ట్రంలో విక్రయించారు. దీని ప్రభావం జిల్లా పత్తి పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపింది. ఈ ఏడాది పత్తి కొనుగోళ్లలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆదాయం లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. పత్తి కొనుగోళ్లతో వచ్చే ఆదాయంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెండోస్థానంలో ఉంది.

ప్రమాదంలో జిన్నింగ్ ఇండస్ట్రీ

మహారాష్ట్రలో అక్కడి ప్రభుత్వం పరిశ్రమలకు పెద్ద ఎత్తున రాయితీలు ఇవ్వడంతో సరిహద్దు జిల్లాలో జిన్నింగ్ మిల్లులు, ఆయిల్ మిల్లులతో పాటు స్పిన్నింగ్ పరిశ్రమలు నెలకొల్పారు. రాయితీల నేపథ్యంలో తెలంగాణలో కంటే క్వింటాల్‌కు రూ.200 నుంచి రూ.300 వరకు అధిక ధర చెల్లిస్తున్నారు. దీంతో వ్యాపారులు, రైతులు తమ పంటలను మహారాష్ట్ర తరలించేందుకు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలోని జిన్నింగ్ మిల్లుల్లో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌కు చెందిన కూలీలు పని చేస్తారు. ఒక్కో మిల్లులో సుమారు వందకు పైగా ఉంటారు. జిల్లా పత్తి మహారాష్ట్ర తరలడంతో ఇక్కడి కూలీలకు కూడా ఉపాధి కరువవుతుంది. అసెంబ్లీ ఎన్నికల ముందు అప్పటి ముఖ్యమంత్రికి ప్రభుత్వ సెస్ రద్దు చేయాలని కోరుతూ స్థానిక వ్యాపారులు వినతిపత్రం సమర్పించారు. సరిహద్దు గ్రామాల వద్ద ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, మహారాష్ట్రకు పత్తి అక్రమ రవాణాను నియంత్రించాలని కోరుతున్నారు.

జిల్లాలో పత్తి కొనుగోళ్లు

సంవత్సరం	కొనుగోళ్లు(క్వింటాళ్లు)	ఆదాయం(రూ.కోట్లలో)
2018- 19	7,32,416	6.63
2019- 20	12,19,224	5.36
2020- 21	11,50,641	5.82
2021- 22	9,00,247	7.20
2022- 23	10,23,721	9.36
2023- 24	12,66,641	8.43

మహారాష్ట్రకు మన పత్తి

ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, జైనూర్ మార్కెట్ కమిటీల పరిధిలోని 18 జిన్నింగ్ మిల్లుల్లోనే పత్తి కొనుగోళ్లు చేపట్టారు. పత్తికి ఒక శాతం మార్కెట్ ఫీజుతో పాటు 2.5 శాతం జీఎస్టీ ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన జిల్లాలో కొనుగోళ్లు జరిగితే ప్రభుత్వానికి క్వింటాల్‌పై సుమారు రూ.300 మార్కెట్ పన్ను లభిస్తుంది. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ మార్గాల్లో పత్తిని మహారాష్ట్రకు తరలించడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది. సరిహద్దులోని వాంకిడి, కెరమెరి, ఇంధాని, కౌటాల మీదుగా నిత్యం లారీలు, వ్యాన్ల మహారాష్ట్రకు పత్తి రవాణా చేశారు. కరీంనగర్, వరంగల్, ఖమ్మంతోపాటు ఇతర జిల్లాల నుంచి సైతం నిత్యం మహారాష్ట్రకు పత్తి రవాణా జరుగుతుంది. ఇక్కడి పత్తి మహారాష్ట్రకు తరలుతుండడంతో జిల్లాలోని జిన్నింగ్ మిల్లులు నిల్వలు లేక వెలవెలపోతున్నాయి. సాధారణంగా ఐదు నెలలపాటు నడవాల్సిన మిల్లులు సరిపడా నిల్వలు లేక మూడు, నాలుగు నెలలు మాత్రమే కొనసాగుతున్నాయి.

పిల్లల్లో పోషకాహార లోపం
అరికట్టాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- చిన్నతనం నుంచే లింగ సమానత్వం బోధించాలి



చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: పిల్లల్లో పోషకాహార లోపం పూర్తిగా అరికట్టాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవనంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పోషణ్ పక్వాడా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పిల్లల్లో ఆరేళ్ల లోపు వయస్సు చాలా ముఖ్యమైందన్నారు. ఆ సమయంలో వారిలో పోషకాహార లోపం రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనని, చిన్నతనం నుంచే లింగ సమానత్వం గురించి బోధించాలన్నారు. ప్రస్తుతం మొబైల్ ఫోన్ల ప్రభావం చిన్నారులపై ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, పెద్దల నుంచి మార్పు రావాలని సూచించారు. పిల్లల ప్రగతికి బాటలు వేసేందుకు వారికి పౌష్టికాహారం అందించడంతోపాటు ఆరోగ్యకరమైన అలవాట్లు, విద్య అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో భాస్కర్, సీడీపీవోలు సాదియా, సురేఖ, అంగన్‌వాడీ టీచర్లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఖరారు

- కాంగ్రెస్ అభ్యర్థిగా ఆత్రం సుగుణ
- సీఈసీ భేటీ తర్వాత రాత్రి జాబితా విడుదల
- ప్రధాన పార్టీల నుంచి తొలిసారిగా ఓ మహిళా అభ్యర్థిని పోటీ



ఆత్రం సుగుణ

బయోడేటా..

పేరు	: ఆత్రం సుగుణ
భర్త పేరు	: ఆత్రం భుజంగరావు
విద్యార్హత	: బీఏ (హెచ్‌పీపీ) బీఈడీ, ఎంఏ (తెలుగు)
పుట్టిన తేదీ	: 16.08.1975
కులం	: ఎస్టీ (గోండు)
సంతానం	: ఇద్దరు కుమారులు (డాక్టర్ ఆత్రం విప్లవ్, ఆత్రం సాయుధ)

సాక్షి,ఆదిలాబాద్: ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థినిగా ఆత్రం సుగుణ పేరును ఖరారు చేశారు. కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) సమావేశం బుధవారం జరగగా, రాత్రి ఏఐసీసీ నుంచి తెలంగాణ రాష్ట్రంలోని మరో నలుగురు అభ్యర్థుల జాబితాను ప్రెస్‌కు రిలీజ్ చేశారు. ఇందులో ఆదిలాబాద్ స్థానానికి సుగుణ పేరును ప్రకటించారు. ఈమె ఆదివాసీలోని గోండు సామాజికవర్గానికి చెందినవారు. బీజేపీ అభ్యర్థి గొడం నగేశ్, బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కులు కూడా ఇదే సామాజికవర్గానికి చెందినవారు. ఇదిలా ఉంటే ఆదిలాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ నుంచి ప్రధాన పార్టీల నుంచి తొలిసారిగా ఓ మహిళా అభ్యర్థిని బరిలో నిలవడం గమనార్హం.

సుగుణ నేపథ్యమిది..

ఆత్రం సుగుణ ఉట్నూర్ జెడ్పీఎస్ఎస్‌లో ఉపాధ్యాయురాలిగా వ్యవహరిస్తూ ఇటీవలే ఆమె స్వచ్ఛంద విరమణ చేసి కాంగ్రెస్‌లో చేరారు. భర్త ఆత్రం భుజంగరావు కూడా ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉన్నారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు డాక్టర్ ఆత్రం విప్లవ్. చిన్న కుమారుడు సాయుధ సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. ఇదిలా ఉంటే ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా నియామకానికి ముందు సుగుణకు రాజకీయాలతో పరిచయం ఉంది. 1995లో జన్నారం మండలం ముత్రిమడుగు ఎంపీటీసీగా గెలుపొందారు. 2008లో డీఎస్సీ ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా నియమితులయ్యారు. కాగా మానవ హక్కుల వేదిక జిల్లా కార్యదర్శిగా, ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ప్రజా ఉద్యమాల్లో ఆమె చురుకైన పాత్ర నిర్వర్తిస్తూ వస్తున్నారు. రాజకీయాల్లో ఆసక్తితో ఈ రంగంలోకి అడుగుపెట్టారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యు) మండలం పుల్లార గ్రామంలో ఆమె జన్మించారు. ఆత్రం భుజంగరావుతో ఆమెకు 1992లో వివాహం జరిగింది. ఇద్దరు పిల్లలు జన్మించిన తర్వాత ఆమె తిరిగి చదువుకొని పదో తరగతి పాసయ్యారు. ఆ తర్వాత క్రమంగా విద్యార్హతలు సాధించారు. ప్రస్తుతం ఈ కుటుంబం ఉట్నూర్‌లో స్థిర నివాసం ఏర్పర్చుకుంది.

ఏఐసీసీ.. పొరపాటు!

- జాబితాలో డాక్టర్ సుగుణ కుమారి పేరు
- పొరపాటున వచ్చిందని చెప్పిన ఇన్‌చార్జి మంత్రి సీతక్క

ఏఐసీసీ నుంచి బుధవారం రాత్రి విడుదల చేసిన కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థుల జాబితాలో పొరపాటు చోటు చేసుకుంది. ఆదిలాబాద్ ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం నుంచి డాక్టర్ సుగుణ కుమారి చెలిమలను ఖరారు చేస్తున్నట్లు పొందుపర్చారు. అయితే డాక్టర్ సుగుణకుమారి ఇదివరకు పెద్దపల్లి నియోజకవర్గం నుంచి పార్లమెంట్ సభ్యురాలిగా వ్యవహరించారు. పెద్దపల్లి ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం. డాక్టర్ సుగుణకు మారి ఎవరా అని మొదట ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కన్ఫ్యూజన్ ఎదురైంది. తీరా అది ఏఐసీసీ నుంచి పొరపాటు చేసుకుందని తెలిసింది. కాగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క స్వయంగా ఆత్రం సుగుణకు ఫోన్ చేసి జాబితాలో జరిగిన పొరపాటును వివరించడం జరిగింది. కాగా రాత్రి సమయంలో ఆ జాబితాను సవరించి ఆత్రం సుగుణ పేరుతో జారీ చేశారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరగాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగే విధంగా అధికారులు, వైద్యులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం డీఎంహెచ్‌వో తుకారాం భట్‌తో కలిసి వైద్యాధికారులు, ప్రోగ్రాం అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పల్స్‌పోలియో కార్యక్రమం వందశాతం లక్ష్యాన్ని పూర్తి చేయడం అభినందనీయమన్నారు. వైద్యాధికారులు గిరిజన ప్రాంతాల్లో మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు, ఉప కేంద్రాల పనితీరు, లక్ష్యాలపై సమీక్షించి సలహాలు, సూచనలు అందించారు. ప్రతినెలా 5న సమావేశం ఏర్పాటు చేసుకుని చేపట్టాల్సిన చర్యలపై చర్చించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా తక్కువ, అతి తక్కువ బరువు ఉన్న పిల్లలను గుర్తించి సరైన పోషకాహారం అందించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మార్చి నుంచి జూన్ వరకు ట్యాంకర్లు, బోర్‌వెల్స్, మిషన్ భగీరథ పైపులైన్ల మరమ్మతులు చేపట్టాలన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధంగా ఉండాలి

జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లకు అధికారులు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి వ్యవసాయ మార్కెటింగ్, రవాణా శాఖ అధికారులు, రైస్ మిల్లుల యజమానులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 37 కొనుగోలు కేంద్రాల్లో ఏప్రిల్ 1 నుంచి కొనుగోళ్లు చేపడతామని తెలిపారు. రైతులకు నీడ, తాగునీటి సౌకర్యం కల్పించడంతోపాటు గన్నీ సంచులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. మే 15లోగా కొనుగోళ్లు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు.

‘ఉపాధి’ కూలీలకు ఇబ్బందులు రానీయొద్దు



మాట్లాడుతున్న డీఆర్‌డీవో సురేందర్

పెంచికల్‌పేట్(సిర్పూర్): వేసవిలో ఉపాధిహామీ కూలీలకు ఇబ్బందులు రానీయొద్దని డీఆర్‌డీవో సురేందర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వేసవిలో కూలీలకు గ్రామాలకు సమీపంలో పని కల్పించాలన్నారు. ఎండదెబ్బ తగలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతీ కుటుంబానికి వంద పనిదినాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలను సంరక్షించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో అల్బర్ట్, ఏపీవో సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



నాగేశ్వరి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న కె.నాగేశ్వరి జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు గిరిజన క్రీడా అధికారి మీనారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 8 నుంచి 11 వరకు యాదాద్రి భువనగిరిలో నిర్వహించిన 56వ రాష్ట్రస్థాయి ఖోఖో చాంపియన్ షిప్‌లో నాగేశ్వరి అత్యుత్తమ ప్రతిభ చాటిందన్నారు. అనంతరం ఈ నెల 16 నుంచి 25 వరకు రంగారెడ్డి జిల్లా పరిగిలో జరిగిన రాష్ట్ర జట్టు శిక్షణా శిబిరంలోనూ తెలంగాణ జట్టు తరఫున పాల్గొందని పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి ఏప్రిల్ 2 వరకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థిని పాల్గొంటుందని వారు పేర్కొన్నారు. అత్యున్నత టెక్నిక్‌తో శిక్షణ ఇస్తున్న ఖోఖో శిక్షకుడు వాసం తిరుపతితోపాటు నాగేశ్వరిని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రమాదేవి, ఏసీఎంవో ఉద్దవ్, ఏటీడీవో క్షేత్రయ్య, జీసీడీవో శకుంతల, శిక్షకులు విద్యాసాగర్, అరవింద్ తదితరులు అభినందించారు.

ఎండుతున్న చెరువులు



నెర్రెలు బారిన పెద్ద చెరువు

జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ దాటాయి. ఎండ వేడికి ప్రాజెక్టులు, చెరువుల్లో నీటిమట్టం క్రమంగా తగ్గిపోతోంది. దహెగాం మండలంలోని గెర్రె చెరువులో చుక్క నీరు లేకుండా ఇంకిపోవడంతో ఎడారిని తలపిస్తోంది. అలాగే మండల కేంద్రానికి సమీపంలోని నల్లచెరువు, చింతపాటి చెరువు, పెద్దచెరువులు క్రమంగా ఎండిపోతున్నాయి. ఫలితంగా దాహార్తి తీర్చుకునేందుకు మూగజీవాలు అవస్థలు పడుతున్నాయి. మరో రెండు నెలలు ఎండలు కొనసాగనున్న నేపథ్యంలో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

– దహెగాం



కుంచవెల్లి చెరువు



చుక్క నీరు లేకుండా ఎండిపోయిన గెర్రె చెరువు

‘వట్టివాగు’ కాలువల్లో పూడికతీత

రెబ్బెన(ఆసిఫాబాద్): వట్టివాగు ప్రాజెక్టుకు సంబంధించి డీ9, డీ10 కాలువల్లో పూడికతీత పనులను బుధవారం సింగరేణి సంస్థ సహకారంతో ఇరిగేషన్ అధికారులు ప్రారంభించారు. రెబ్బెన మండలంలో వట్టివాగు ప్రాజెక్టు ఆయకట్టు కింద రైతులు వరి సాగు చేస్తున్నారు. పూడిక కారణంగా కొన్ని రోజులుగా డీ9, డీ10 కాలువ కింద సాగవుతున్న పంటలకు సాగునీరు అందడం లేదు. రైతులు ఈ విషయాన్ని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఇందిరానగర్, పుంజుమేరగూడ, నక్కలగూడ, రెబ్బెన ప్రాంతాల్లో వట్టివాగు కాలువ కింద పంటలకు సాగు నీరందించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు సమస్యను వివరించారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని పూడికతీత పనులకు సింగరేణి తోడ్పాటు అందించాలని జీఎం రవి ప్రసాద్‌కు సూచించారు. దీంతో సింగరేణి యాజమాన్యం ప్రత్యేకంగా ప్రొక్లైనర్ సమకూర్చింది. నేర్పల్లి శివారులో వట్టివాగు కాలువల్లో పేరుకుపోయిన తుంగ, పూడికమట్టిని తొలగించే పనులను చేపట్టారు. వారం రోజుల్లో పనులు పూర్తి చేసి పంటలకు సాగు నీరందిస్తామని వారు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు రమేశ్, దేవాజీ, మురళీ, దేవేందర్, ఇరిగేషన్ జేఈ జానీ, సింగరేణి అధికారులు ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సర్వీస్ వైర్ చోరీ

జన్నారం: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ మోటార్లకు అమర్చిన సర్వీస్ వైర్ చోరీకి గురికావడం రైతులను కలవరపెడుతోంది. ఇటీవల బాదంపల్లిలో సుమారు 500 మీటర్ల వైర్ చోరీకి గురైంది. తాజాగా మంగళవారం రాత్రి కలమడుగులో రైతులు బొంతన మల్లేశ్, జక్కుల గౌరయ్య, గట్టి విష్ణుమూర్తి, మేకల మల్లేశ్, బాద లక్ష్మి, జక్కుల నరేష్, సంగ రాజన్న, యాదగిరి రాంమోహన్‌రావుకు చెందిన సుమారు రూ.లక్ష విలువైన సర్వీస్ వైర్ చోరీకి గురైంది. అధికారులు దృష్టి సారించి సర్వీస్ వైర్ దొంగలను గుర్తించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

ఇరువర్గాలపై కేసు

సిర్పూర్(టి): మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు ఓ కంటైనర్ వ్యాన్‌లో 19 పశువులను తరలిస్తున్న వాహనాన్ని మండల కేంద్రంలోని డౌనల్ ప్రాంతంలో సోమవారం రాత్రి యువకులు అడ్డుకున్నారు. ఈ ఘటనలో మరో వర్గం వారు వచ్చి నిరాకరించడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో ఇరువర్గాలకు చెందిన మొత్తం 24 మందిపై కేసులు నమోదు చేసినట్లు సిర్పూర్(టి) ఎస్సై డీకొండ రమేశ్ తెలిపారు.

పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్

మంచిర్యాలక్రైం: రోడ్డు ప్రమాదం కేసులో కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న ఓ నిందితుడిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ భన్సీలాల్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఏసీసీ సమీపంలో 2017 మే 26న హమాలీవాడకు చెందిన గుర్రాల శంకర్ మంచిర్యాల నుంచి గద్దెరాగడి వైపు ఆటోలో వెళ్తుండగా డ్రైవర్ ముప్పాళ్ల సమ్మయ్య అజాగ్రత్తగా ఆటో నడిపి ప్రమాదానికి కారణమయ్యాడు. ఈ ప్రమాదంలో శంకర్‌కు తీవ్ర గాయలయ్యాయి. ప్రమాదానికి కారణమైన సమ్మయ్యపై కేసు నమోదు కాగా కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతుండడంతో కోర్టు నాన్ బెయిల్ వారంట్ జారీ చేసింది. నిందితుడిని అరెస్ట్ చేసి లక్సెట్టిపేట జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

గుడుంబా పట్టివేత

దండేపల్లి: మండలంలోని లింగాపూర్‌కు చెందిన జర్పుల గణేశ్ గుడుంబా తరలిస్తుండగా బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపారు. ఎన్నికల తనిఖీల్లో భాగంగా దండేపల్లి సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా స్కూటీపై వస్తున్న గణేశ్‌ను ఆపి తనిఖీ చేయగా 5 లీటర్ల గుడుంబా లభించింది. నిందితుడిని అదుపులోకి తీసుకుని గుడుంబా, స్కూటీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీలో చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ భన్సీలాల్ తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లా చింతలమానెపల్లికి చెందిన లత్కారి సాయి కిరణ్ బుధవారం తెల్లవారు జామున హైటెక్ సిటీలో పిల్లలమర్రి వంశీకి చెందిన నిర్మాణంలో ఉన్న నూతన అపార్ట్‌మెంట్‌లోకి వెళ్లి గేటు తాళం పగులగొట్టి ప్లంబింగ్ సామగ్రి, పైపు బెండల్‌ను దొంగిలించాడు. వంశి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. బుధవారం రాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న సాయికిరణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించడంతో నిందితున్ని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

నగదు పట్టివేత



పట్టుకున్న నగదుతో ఎస్సై

సిర్పూర్(టి): మండలంలోని వెంకట్రావ్‌పేట్ ఎక్స్‌రోడ్ మీదుగా మహారాష్ట్రకు తరలిస్తున్న నగదును బుధవారం సిర్పూర్(టి) ఎస్సై డీకొండ రమేశ్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. వెంకట్రావ్‌పేట్ చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన గుగులోత్ రాందాస్ లక్ష రూపాయలు తరలిస్తూ పట్టుబడ్డాడు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వాంకిడిలో రూ.1.81 లక్షలు పట్టివేత

వాంకిడి: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వద్ద వాహనాల తనిఖీల్లో మహారాష్ట్ర నుంచి ఆసిఫాబాద్ వైపునకు తరలిస్తున్న రూ.1.30 లక్షలు, మరో వాహనంలో రూ.51 వేలు పట్టుకున్నట్లు ఎస్సై సాగర్ తె లిపారు. నగదుకు సంబంధించి సరైన ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో డీసీఆర్‌బీ సీఐ రమేశ్ పాల్గొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్‌తో ఢీకొట్టిన కేసులో ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. ఈ నెల 24న మధ్యాహ్నం 2 గంటల సమయంలో మహాలక్ష్మీవాడకు చెందిన నరేష్ ద్విచక్ర వాహనంపై పట్టణంలోని తిర్పెల్లి నుంచి మహాలక్ష్మీవాడకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ డ్రైవర్ వెనుక నుంచి ఢీకొట్టాడు. బాధితుడు ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం బుధవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ పేర్కొన్నారు.

నిప్పుతో జాగ్రత్త..!

- చిన్న తప్పిదాలతోనే అగ్ని ప్రమాదాలు
- అప్రమత్తతతోనే నివారణ

మంచిర్యాలక్రైం: చిన్నచిన్న తప్పిదాలతోనే నిత్యం ఏదో ఒకచోట అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీంతో ఆస్తి, ప్రాణనష్టం జరుగుతున్నాయి. అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో మేలు. పట్టణాల్లో జరిగే 70 శాతం అగ్ని ప్రమాదాలు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్లే జరుగుతున్నాయి. దీనికి కారణం నాసిరకం విద్యుత్ తీగలు వాడడమే. తక్కువ ధరకు కొనుగోలు చేసిన తీగలతో ఓవర్ లోడ్ విద్యుత్ సరఫరా జరిగినప్పుడు షార్ట్‌సర్క్యూట్ ఏర్పడుతోంది. తీగలు తెగినప్పుడు అతుకులు వేయడంతో ఓవర్‌లోడ్ విద్యుత్ సరఫర అయినప్పుడు ఆప్రాంతంలో వేడికి కరిగిపోయి షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగే అవకాశం ఉంది.

గ్రామీణ ప్రాంతాల్లో ఇలా....

వేసవి కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లమధ్యలో గడ్డివాములు, పత్తి కట్టెలు వేయడం వలన అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఇవి ఇళ్ల మధ్యనే వేయడం ప్రమాదకరమన్న విషయాన్ని ఎవరూ గుర్తించడం లేదు. ఎండల తీవ్రతకు గడ్డివాములకు తొందరగా నిప్పంటుకునే అవకాశం ఉంది. పల్లెల్లో ఇంటి ఆవరణలోనే కట్టెల పొయ్యి వెలిగిస్తుంటారు. దీంతో నిప్పురవ్వలు ఎగిసి గడ్డివాములపై పడి ప్రమాదాలు చోటు చేసుకుంటాయి. ఎవరైనా బీడీలు, సిగరెట్లు తాగి అక్కడే పడేసినా ప్రమాదమే. అందుకే గడ్డివాములు ఊరికి దూరంగా ఏర్పాటు చేసుకుంటే మంచిది.

పత్తి నిల్వలు పదిలం...

ఎత్తి కట్టెలకు, నిలువ ఉన్న పత్తికి మంటలు తేలికగా అంటుకునే స్వభావం ఉంటుంది. పత్తి నిల్వచేసిన ప్రాంతంలో విద్యుత్ సరఫరా లేకుండా చూడాలి. జిన్నింగ్ పరిశ్రమల్లో పత్తి కుప్పలు(గంజి) మధ్య రెండు నుంచి మూడు మీటర్ల మధ్య దూరం ఉంచాలి. ఒకవేళ ప్రమాదం జరిగినా ఒకే కుప్ప కాలిపోతుంది. దీంతో నష్టం తక్కువ వస్తుంది. కానీ ఈ నిబంధనలు ఎవరు పాటించడం లేదు.

అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు



కన్నెపెల్లి మండలం మెట్‌పెల్లిలో షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన మొర్ల భీమయ్య ఇల్లు (ఫైల్)

- పరిశ్రమలు, అపార్టుమెంటు, వాణిజ్యపరమైన స్థలాలు, హోటళ్లు, బార్లు, సినిమా థియేటర్లు, కల్యాణ మండపాలు, తదితర ప్రదేశాల్లో అగ్నిమాపక పరికరాలు తప్పనిసరిగా ఉంచుకోవాలి.
- ఇంట్లో ఇసుక బకెట్లు ఉంచితే గ్యాస్ లికేజీ ఏర్పడినప్పుడు మంటలు ఆర్పేందుకు నీళ్లతో పాటు ఇసుక కూడా వాడొచ్చు.
- పెట్రోల్, డీజిల్, ఆయిల్, గ్రీజ్ తదితర చమురు పదార్థాలు కాలుతున్నప్పుడు నీళ్లు పోయకూడదు. అల్యూమినియం, సల్ఫేట్, సోడియం బైకార్బోనైట్ మిశ్రమం గల నురుగు గల పరికరాన్ని ఉపయోగించాలి.
- విద్యుత్‌తో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు కార్బన్ డయాక్సైడ్ గ్యాస్ పరికరాన్ని వాడాలి. నీళ్లు ఉపయోగిస్తే షాక్ వస్తుంది.
- వంటగదికి కిటికీలు, వెంటిలేటర్లు ఉంటే గ్యాస్ లీకేజీ ఏర్పడినా బయటకు వెళ్లిపోతుంది. వంటగదిలో దేవుళ్ల ఫొటోలు ఉంచకూడదు.

జిల్లాలో ఇటీవల జరిగిన భారీ అగ్ని ప్రమాదాలు

- సీసీసీ నస్పూర్‌లో ఈ నెల 2న రాజా ఎలక్ట్రానిక్స్ షాపులో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. రూ.10 లక్షల ఆస్తినష్టం జరిగింది.
- గతేడాది డిసెంబర్ 22న కన్నెపెల్లి మండలం మెట్‌పల్లిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మొర్ల భీమయ్య పూరిగుడిసె దగ్ధమైంది. పత్తి, వరి పంట విక్రయించగా వచ్చిన రూ.8 లక్షల 80వేల నగదు, 11తులాల బంగారం, 78 తులాల వెండి కాలి పోయింది.

నిర్లక్ష్యం వల్లే..



చిన్నపాటి నిర్లక్ష్యంవల్లే అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అగ్ని ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతీ శుక్రవారం ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చు.

– అజయ్‌బాబు, జిల్లా ఫైర్ అధికారి, మంచిర్యాల

జిల్లాలో నాలుగేళ్లలో జరిగిన అగ్ని ప్రమాదాలు			జిల్లాలోని ఫైర్‌స్టేషన్ల ఫోన్ నంబర్లు		
సంవత్సరం	అగ్ని ప్రమాదాలు	ఆస్తినష్టం	అగ్నిమాపక కేంద్రం	అధికారిసెల్‌నంబర్	ఫైర్‌స్టేషన్ ల్యాండ్/మొబైల్ నంబర్
2020–2021	184	రూ. 2కోట్లు	మంచిర్యాల	8712699195	08736 252101/8712699194
2021–2022	124	రూ.88లక్షలు	బెల్లంపల్లి	8712699199	08735 225101/8712699198
2022–2023	152	రూ.1.10కోట్లు	జన్నారం	8712699197	08739 245101/8712699196
2023–2024 మార్చి 13వరకు	158	రూ.1.1కోట్లు	చెన్నూర్	8712699201	08737 242101/8712699200

ప్రభుత్వం దృష్టికి సింగరేణి సమస్యలు



మాట్లాడుతున్న జెట్టి శంకర్‌రావు

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికుల ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ పెద్దలను కలవనున్నట్లు ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు తెలిపారు. బుధవారం నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం ఉదయం సింగరేణి అన్ని ఏరియాల నుంచి ఐఎన్‌టీయూసీ బ్రాంచి ముఖ్య నేతలు హైదరాబాద్‌కు వెళ్లి రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సింగరేణి సీఎండీ ఎన్.బలరాంను కలిసి కార్మికుల ప్రధాన డిమాండ్లను వారి దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో ఆ యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు గరిగే స్వామి, కలవేన శ్యామ్, సీహెచ్ భీంరావు, బ్రాంచ్ నాయకులు ల్యాగల శ్రీనివాస్, పెట్టం శ్రీనివాస్, నర్సింగ్, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లహరి బస్సుల్లో 10 శాతం రాయితీ

మంచిర్యాలఅర్బన్: ప్రయాణికుల సౌకర్యార్థం లహరి ఏసీ స్లీపర్, ఏసీ స్లీపర్ కమ్ సీటర్ బస్సుల్లో బెర్త్‌లపై 10 శాతం రాయితీ కల్పించినట్లు మంచిర్యాల డీఎం రవీంద్రనాథ్ తెలిపారు. సాధారణ టికెట్ ధరలో ప్రయాణికులు బుక్ చేసుకునే బెర్త్‌లపై 10 శాతం డిస్కౌంట్ కల్పించినట్లు తెలిపారు. లహరి ఏసీ బస్సులు మంచిర్యాల నుంచి మియాపూర్‌కు ఉదయం 11:30 గంటలకు, రాత్రి 11:20 గంటలకు, మంచిర్యాల నుంచి ఎంజీబీఎస్ మధ్యాహ్నం 2గంటలకు, రాత్రి 11 గంటలకు, లహరి నాన్ ఏసీ బస్సు మంచిర్యాల నుంచి ఎంజీబీఎస్ ఉదయం 4:30 గంటలకు, మధ్యాహ్నం 11 గంటలు, చెన్నూర్ నుంచి ఎంజీబీఎస్‌కు రాత్రి 8గంటలకు, మంచిర్యాల వయా లక్సెట్టిపేట్ మీదుగా మియాపూర్‌కు రాత్రి 11 గంటలకు బస్సులు రాకపోకలు సాగిస్తాయన్నారు. ఎంజీబీఎస్ నుంచి మంచిర్యాలకు ఉదయం 6:30 గంటలకు మియాపూర్ నుంచి మంచిర్యాలకు రాత్రి 8.30 గంటలకు, ఎంజీబీఎస్ నుంచి మంచిర్యాలకు రాత్రి 11 గంటలకు, నాన్‌ఏసీ బస్సు ఎంజీబీఎస్ నుంచి మంచిర్యాలకు ఉదయం 5:15 గంటలకు, మియాపూర్ నుంచి మంచిర్యాలకు ఉదయం 7గంటలకు, ఎంజీబీఎస్ నుంచి మంచిర్యాలకు ఉదయం 11:45 గంటలకు, ఎంజీబీఎస్ వయా చెన్నూర్ మీదుగా మంచిర్యాలకు రాత్రి 9:30 గంటలకు బస్సులు రాకపోకలు సాగిస్తాయని ఆయన పేర్కొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్డీవో హరికృష్ణ

బెల్లంపల్లి: ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆర్డీవో హరికృష్ణ అన్నారు. బెల్లంపల్లి శివారు కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలోని మంచిర్యాల–చంద్రాపూర్ జాతీయ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై బుధవారం ఆర్డీవో అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటర్న్ వద్ద అధిక కాంతిని ఇచ్చే విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, వాహన దారులకు స్పష్టంగా కనిపించేలా సూచికలు, యాక్సిడెంట్ ఫోర్న్ ఏరియాగా గుర్తిస్తూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. యూటర్న్ వద్ద ఆర్టీసీ బస్సులు ఆపడాన్ని కట్టడి చేయాలన్నారు. నేషనల్ హైవేను ఆనుకుని ఉన్న మద్యం షాపుల వద్ద , ఆసుపత్రి వద్ద ట్రాఫిక్ ఏర్పడకుండా ఆంక్షలు విధించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి, తహసీల్దార్ కే.వై ప్రసాద్, బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, ఎంపీడీవో మహేందర్ పాల్గొన్నారు.

వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలి



డీసీపీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జన్నారం: కడెం నీటి పారుదల కార్యాలయంలో టెక్నికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న తోకల రాకేశ్‌ను వేధించి ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో మంచిర్యాల డీసీపీ అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఇద్దరు ఉద్యోగుల వేధింపుల వల్లే రాకేశ్ ఆత్మహత్య చేసుకున్నట్లు మరణ వాంగ్మూలం ఇవ్వడమే కాకుండా జన్నారం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనా కార్యాలయ సూపరింటెండెంట్ ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌పై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. వెంటనే వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, మృతుని సోదరుడు విశేష్ ఉన్నారు.

నిందితుడి రిమాండ్

లింగాపూర్: మండలంలోని నఢంగూడ గ్రామానికి చెందిన జాదవ్ విలాస్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు ఈనెల 24న విలాస్ నివాసంలో తనిఖీ చేయగా మద్యం లభించడంతో సీజ్ చేశారు. ఈ నెల 26న వెళ్లి తనిఖీలు నిర్వహించగా దుర్భాషలాడుతూ ఎస్సైపై దాడికి దిగాడు. దీంతో నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

అసైన్డ్ భూమిలో పనులు అడ్డుకున్న అధికారులు

కాసిపేట: సోమగూడెంలో అకెనపల్లి శివారు సర్వే నంబర్ 3పైకి అసైన్డ్ భూమిలో చేపట్టిన పనులను బుధవారం అధికారులు అడ్డుకున్నారు. ఈ భూమి వివాదంపై బెల్లంపల్లి ఆర్డీవోకు మంగళవారం కొంతమంది ఫిర్యాదు చేయడంతో విచారణకు వచ్చామని, పనులు నడుస్తుండటంతో అడ్డుకుని సంబంధిత పత్రాలు ఉంటే కార్యాలయంలో చూపించాలని ఎంఆర్ఐ విజయలక్ష్మి తెలిపారు. కమిటీ ఆధ్వర్యంలో నిత్యం ప్రభుత్వ, అసైన్డ్ భూములు పరిశీలిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

ఓబీ లక్ష్యాన్ని పెంచాలి

- డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి



ఓసీపీ వ్యూపాయింట్ వద్ద డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

శ్రీరాంపూర్: ఓపెన్ కాస్ట్‌లో ఓబీ వెలికితీత లక్ష్యాన్ని పెంచాలని సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) జీ.వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గని, ఆర్కే7 గనులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా కేవలం నాలుగు రోజులే మిగిలి ఉందన్నారు. ఈ నాలుగు రోజుల కాలంలో ఓబీ మరింత అధికంగా తీయడం వలన బొగ్గు అధికంగా వచ్చే అవకాశం ఉందన్నారు. ఇందుకు ఓబీ కాంట్రాక్టర్లు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం ఆర్కే 7గనిలో రెండవ సీమ్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, ఎస్‌వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్, ఆర్కే7 గ్రూప్ ఇన్‌చార్జి ఏవీ రెడ్డి, ఓసీపీ మేనేజర్ బ్రహ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలి

జైపూర్: రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలని సింగరేణి డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ జి.వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఇందారం ఓపెన్‌కాస్టు గనిని తనిఖీ చేశారు. ఆయన వెంట ఇందారం ఓపెన్‌కాస్టు ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్, గ్రూపు మేనేజర్ వెంకటేశ్వర్లు, గని మేనేజర్ రవికుమార్, ప్రాజెక్టు ఇంజనీర్ రమేశ్, ఏరియా సెక్యూరిటీ అధికారి మురళీమోహన్, తదితరులు ఉన్నారు.

నిధులు కేటాయించాలని వినతి

జైపూర్: ముంపు గ్రామానికి నిధులు కేటాయించాలని కోరుతూ జైపూర్ మండలం రామారావుపేట గ్రామస్తులు వెంకటేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గ్రామానికి రెండు వైపులా శ్రీరాంపూర్, ఐకేటీసీపీల డంపు, క్వారీ ఏరియా ఉందని, తీవ్ర కాలుష్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇందారం ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి శ్రీరాంపూర్ ఓసీపీ చెక్‌పోస్ట్ వరకు బీటీ రోడ్డు, అంతర్గత సీసీ రోడ్లు నిర్మించాలని కోరారు. స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక



1986–87 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు 38 ఏళ్ల అనంతరం ఒకేచోట కలుసుకున్నారు. జన్నారం మండలం రేండ్లగూడలో జరిగిన నరేశ్ కుమారుడు హరీశ్ వివాహానికి సుదూర ప్రాంతాలలో ఉన్న పూర్వ విద్యార్థులు 40 మంది ఒకే చోట కలుసుకున్నారు. తమ అనుభవాలను పంచుకుని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

– జన్నారం

ప్రమాదాల నివారణ ప్రతిఒక్కరి బాధ్యత



మాట్లాడుతున్న రక్షణాధికారి రవీందర్

కాసిపేట: ప్రమాదాల నివారణ ప్రతిఒక్కరి బాధ్యత అని, కార్మికులు రక్షణతో కూడిన విధులు నిర్వర్తించాలని ఏరియా రక్షణాధికారి ఎం.రవీందర్ సూచించారు. బుధవారం మందమర్రి ఏరియా కాసిపేట–2 గనిపై రక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగి ఏకాగ్రతతో విధులు నిర్వహించాలన్నారు. ప్రమాదరహిత ఉత్పత్తి ప్రధాన కర్తవ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కేకే గ్రూపు ఏజెంట్ రామదాసు, గని మేనేజర్ లక్ష్మీనారాయణ, రక్షణాధికారి సంతోష్‌రావు, ఏరియా ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలు పొలాల్లోకి చేరాలి

జగిత్యాలఅగ్రికల్చర్: వ్యవసాయ శాస్త్రవేత్తల పరిశోధనలు పొలాల్లోకి చేరాలని, అప్పుడే రైతులకు మేలు జరుగుతుందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రీసెర్చ్ డైరెక్టర్ రఘురామిరెడ్డి అన్నారు. ఉత్తర తెలంగాణ ప్రాంతంలో వరి విస్తీర్ణం 21శాతానికి పెరిగిందని, సోయాచిక్కుడు విస్తీర్ణం 10 శాతం పెరిగిందని, చెరుకు విస్తీర్ణం మాత్రం 73 శాతం, పెసర 61 శాతం, మొక్కజొన్న 12 శాతం, కందుల విస్తీర్ణం 8శాతం, పత్తి విస్తీర్ణం నాలుగు శాతం తగ్గడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో ఉత్తర తెలంగాణ జోనల్ స్థాయి శాస్త్రవేత్తల సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఆయా జిల్లాల వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు. వ్యవసాయ వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ సుధారాణి, పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్ శ్రీనివాస్, అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర డైరెక్టర్ బాలు మాట్లాడారు. అనంతరం వివిధ పంటల సాగు బ్రోచర్లను ఆవిష్కరించారు.

ఐదు తెగల ఆదివాసీలను గుర్తించాలి



నినాదాలు చేస్తున్న ఆదివాసీ తెగల పెద్దలు

ఇంద్రవెల్లి: ఆదివాసీలోని పర్దాన్, తోటి, నాయక్‌పోడ్, అంధ్, కొలాం గిరిజనులను ఆయా రాజకీయ పార్టీలు గుర్తించి న్యాయం చేయాలని ఐదు తెగల కార్యాచరణ కమిటీ పెద్దలు డిమాండ్ చేశారు. మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద బుధవారం సమావేశమయ్యారు. ముందుగా అమరులకు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఐదు తెగల ఆదివాసీ ఓటర్లు సుమారు రెండు లక్షలకు పైగా ఉన్నట్లు తెలిపారు. అయితే రాజకీయ పరంగా ఇప్పటి వరకు తమను ఏ పార్టీ గుర్తించలేదన్నారు. ఇప్పటికైనా గుర్తించకపోతే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని ఐదు తెగల సంఘాల నాయకులు ఆర్క ఖమ్ము, దుర్వ నగేశ్, వసంత్ రావ్, అశోక్, భీముడు, పాండురంగ్, రమేశ్, వెంకటేశ్, తిరుపతి తదితరులున్నారు.

అధికారులు బాధ్యతతో పనిచేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా
- ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గ అధికారుల సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో జరిగే పార్లమెంటు ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముధోల్, ఖానాపూర్, ఆసిఫాబాద్, సిర్పూర్ (టి) అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలోని ఏఆర్వో, ఎస్‌డీపీలతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,111 పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ యూనిట్స్ 2,638 కంట్రోల్ యూనిట్స్ 2,638, వీవీప్యాట్స్ 2,908, మొబైల్ కనెక్టివిటీ 2,039 ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. షాడో పోలింగ్ కేంద్రాలు సిర్పూర్‌లో 11 , ఆసిఫాబాద్‌లో 28, ఖానాపూర్‌లో 9, ఆదిలాబాద్‌లో 9, బోథ్‌లో 14, నిర్మల్‌లో 1 ఉన్నాయన్నారు. పోలింగ్ సిబ్బందికి ఏప్రిల్ 3, 4 తేదీలలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతిఒక్కరూ ఫారం 12డి ఉపయోగించాలన్నారు. సెక్టోరల్ అధికారులకు టీంవైజ్‌గా శిక్షణ ఇవ్వాలన్నారు. ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆరు అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు, రెండు అంతర్ జిల్లా చెక్ పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీ చేస్తున్నామన్నారు. ఎలాంటి సిగ్నల్ వ్యవస్థ లేని షాడో పోలింగ్ స్టేషన్ ప్రాంతాలను గుర్తించి కమ్యూనికేషన్ వ్యవస్థను పటిష్టం చేసేలా వీహెచ్‌ఎఫ్ సెట్లను ఉపయోగించాలన్నారు. సమావేశంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతో, నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆదిలాబాద్ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్, ఏఎస్‌డీఎస్పీలు, డీఎస్పీలు, ఆర్డీవోలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.